APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 16 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :81 పేజీలు : 04 వెల: 2-00/-

# మీ భవిష్యత్ లక్ష్యాలు దేశానికి ఉపయోగపడాలి

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు





అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : విద్యార్థులు నిర్దేశించుకునే భవిష్యత్ లక్ష్యాలు.. మనదేశానికి ఉపయోగపడేలా ఉండాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా వెంకటాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వేడుకలు నిర్వహించుకున్నారు. జాతీయ జెండాలను అందజేస్తూ.. స్వాతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను గురించి వారికి వివరించారు. అనంతరం జాతీయ స్థాయి స్పారో డే సందర్భంగా కాకినాడ అటవీశాఖ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వెంకటాపురం గ్రామానికి చెందిన మహేష్-గంగమ్మ కుమారుడైన యశ్వంత్ 8వ స్థానం సాధించారు. ఈనేపథ్యంలో వారు ఎమ్మెల్యే సునీతను కలవగా.. విద్యార్థితో పాటు తల్లిదండ్రులను కూడా అభినందించారు. అనంతరం రామగిరి మండలం పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాతో ఎమ్మెల్యే సునీతకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల విద్యాధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు అరవింద్, ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2025 -26 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో మొదటి మూడు స్థానాలు మార్కులు సంపాదించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తన సొంత నిధులతో నగదు బహుమ-తులను ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులందరికీ పెన్నులు, బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలకు స్వయంగా తానే భోజనం వడ్డించారు. ఆ తర్వాత నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. ఎన్.సి.సి విద్యార్థులు ఘన స్వాగతం పలుకుతూ కళాశాల ప్రాంగణంలోకి ఆహ్వానించారు. అక్కడ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం.. విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. మీ పిల్లల భవిష్యత్తు కోసమే ఇక్కడ ఈ పాఠశాల నిర్మించామని.. ఇక్కడ ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్తగా ఏర్పాటైన జూనియర్ కళాశాలకు అవసరమైన డ్రైనేజీ, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాల గదులు, వంటశాలను సందర్శించారు. విద్యార్థుల కోసం ఆమె బజ్జీలు వేశారు. విద్యార్థులకు భోజనం వడ్డిస్తూ.. తాను కూడా రుచి చూశారు. మెను ప్రకారం కచ్చితంగా విద్యార్థులకు భోజనం అందాలన్నారు.



ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మనకు స్వాతంత్రం వచ్చిందని.. వారిని ఎప్పటికీ మరువకూడదన్నారు. విద్యార్థులు, యువత చేత-ల్లోనే మన దేశ భవిష్యత్తు ఉందని.. మీ కోసం ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని.. వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. మీరు ఎంచుకునే లక్ష్యాలు మీ భవిష్యత్ కోసం మాత్రమే కాకుండా దేశానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. బాగా చదవడం, క్రమశిక్షణతో జీవించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడం అనేది మనకు ప్రాథమిక సూత్రాలు కావాలన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష అనే భేదాలకు అవకాశం లేకుండా మనం మెలగాలన్నారు. దేశం కోసం ఎంతో కొంత మనం సేవ చేయాలన్నది మీకు ఇప్పటి నుంచే మనసులో బలంగా నాటుకుపోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## పెట్రోల్, డీజిల్ పై ట్యాక్స్ కట్..

ఢిల్లీ, ఆగస్టు 16: ఇదివరకు దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. 15 రోజుల వ్యవధిలో వీటి రేట్లు రూ. 7.50 పైసల వరకు ఎగబాకాయి. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరలు సైతం వీటికి తోడయ్యాయి అప్పట్లో. రేటు విషయంలో ఈ మూడింటి మధ్య పెద్ద తేడా ఉండట్లేదు. ఇక ముందు పెరగకపోవచ్చనే గ్యారంటీ లేదు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి మరోసారి పెట్రోల్, డీజిల్ రేట్ల ధరలు మళ్లీ పెరగొచ్చనే వాదనలు లేకపోలేదు. ఈ పరిణామాల మధ్య కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్ తో పాటు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై ఎగుమతి ట్యాక్స్ ను మరింత తగ్గించింది. 15 రోజుల పాటు అంటే.. నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఈ తగ్గుదల కొనసాగుతుంది. అంతర్జాతీయ ఇంధన ధరల ఆధారంగా కేంద్రం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి 15 రోజులకోసారి నిర్వహించే సమీక్ష సందర్భంగా పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ డ్యూటీని సవరించింది. దేశీయ ఇంధన పన్నుల్లో మాత్రం ఎటువంటి మార్పు చేయలేదు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం నేటి నుండి ప్రారంభం అయ్యే మలి 15 రోజులకు ఈ తగ్గింపులు వర్తిస్తాయి. డీజిల్ ఎగుమతులపై ప్రతి లీటరుకు విండ్‌ఫాల్ ట్యాక్స్ రూ. 25.5 నుండి రూ. 24 కు తగ్గింది. ఎయిర్ టర్బైన్ ఫ్యూయెల్ పై పన్ను లీటరుకు రూ. 22 నుండి రూ. 19.5 పైసలకు తగ్గించారు. పెట్రోల్ ఎగుమతులపై లీటరుకు రూ. 3.50 పైసలుగా ఉన్న ట్యాక్స్ ను పూర్తిగా రద్దు చేశారు. దీంతో పెట్రోల్ ఎగుమతులపై జీరో ట్యాక్స్ పడింది. ఈ పన్నుల తగ్గింపు విదేశాలకు ఎగుమతి చేసే ఇంధన ఉత్పత్తులకు మాత్రమే వర్తిస్తుంది. దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. అవి యథాతథంగా కొనసాగుతున్నాయి. ఈ పన్నుల సవరణతో లభించే తక్షణ ప్రయోజనం చమురు శుద్ధి సంస్థలు, ఎగుమతిదారులకు మాత్రమే పరిమితం. పెట్రోల్ ఎగుమతులపై విధించే డ్యూటీ.. పూర్తిగా ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకంగా వసూలు చేస్తుంది కేంద్ర ప్రభుత్వం.




## స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం...?



ఆంధ్రప్రదేశ్ ,ఆగస్టు 16: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఓటర్ల జాబితా ఇపుడు కీలకంగా మారింది. పాత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తామని ఇంతకు ముందు అధికారులు చెప్పినట్లుగా ప్రకటనలు వచ్చాయి. అయితే పాత జాబితాతో ఎలా నిర్వహిస్తారు అన్న విమర్శలు వచ్చిపడ్డాయి. అందులో షిఫ్ట్ అయిన ఓటర్లు చనిపోయిన ఓటర్లు, మ్యాపింగ్ లో లేని ఓటర్లు అంతా కలసి ఏకంగా 45 లక్షల మంది దాకా పక్కకు పోయారు. డబుల్ ఎంట్రీ ఓటర్లను కూడా తగ్గించి చూపించారు. దాంతో నాలుగు కోట్ల దాకా ఉన్న ఏపీ ఓటర్ల సంఖ్య మూడున్నర కోట్లకు వచ్చింది. దాంతో పాత జాబితా అంటే ఇవన్నీ మళ్లీ చర్చకు వస్తాయి. దాంతోనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ విషయంలో తర్జన భర్జన పడుతోంది అంటున్నారు ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ ఓటర్ల తుది జాబితా ఈ ఏడాది అక్టోబర్ 3న విడుదల కానుంది. ప్రస్తుతం ముసాయిదా జాబితా అందుబాటులో ఉంది, దీనిపై అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 30 వరకు కొనసాగుతుంది. అందులోనే పక్కాగా వివరాలు అన్నీ వస్తాయని అంటున్నారు. సర్ (మిగతా 2వ పేజీలో)


## చంద్రబాబుతో మరో కార్యక్రమానికి పవన్ డుమ్మా..!

ఆంధ్రప్రదేశ్ ,ఆగస్టు 16: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న మరో అధికారిక కార్యక్రమానికి వరుసగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ (ఘిఘుఅ ఔెశ్రీఘఅ) దూరమయ్యారు. ఇవాళ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ నివాసం లోక్ భవన్ లో సంప్రదాయంగా జరిగే ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆయన హాజరు కావడం లేదని జనసేన పార్టీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. తాజాగా అమరావతి లో స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో చంద్రబాబుతో పాటు ఆయన పాల్గొనాల్సి ఉండగా.. విశాఖలో ఏనుగుల దినోత్సవానికి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ తీవ్ర జ్వరం కారణంగా ఈ సాయంత్రం లోక్ భవన్‌లో నిర్వహించే "ఎట్ హోమ్" కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నారని జనసేన పార్టీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ విషయాన్ని లోక్ భవన్ అధికారులకు కూడా తెలియజేసినట్లు పేర్కొంది. ఇవాళ ఉదయం కాకినాడలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఆ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించుకున్నారని తెలిపింది. రాజమహేంద్రవరంలో డాక్టర్లు పవన్ కళ్యాణ్ ను పరీక్షించారని జనసేన వర్గాలు తెలిపాయి. కొంత ఉపశమనం తర్వాత ఆయన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారని తెలిపాయి. ఇటీవల పవన్ (మిగతా 2వ పేజీలో)



# దేశమంతటా ఫ్రీ ఆన్‌లైన్ కోచింగ్..!

ఢిల్లీ, ఆగస్టు 16: పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న కోచింగ్ ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. నేటి పోటీ ప్రపంచంలో తమ పిల్లలను పెద్ద పెద్ద కోచింగ్ సెంటర్లకు పంపలేక సగటు తల్లిదండ్రులు పడుతున్న వేదనను తొలగించేలా, దేశవ్యాప్తంగా ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఎర్రకోట బురుజులపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఆయన ఈ సంచలన హామీ ఇచ్చారు. ప్రస్తుత కాలంలో పిల్లలను ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు పంపకపోతే రేసులో వెనుకబడిపోతామేమోనన్న భయంతో మధ్యతరగతి తల్లిదండ్రులు లక్షలాది రూపాయలు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తున్నారు. ఈ ఆర్థిక భారాన్ని గమనించిన ప్రభుత్వం, దేశంలోని ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను, మన అధునాతన డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానిస్తూ ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల విద్యార్థులు తమ ఇళ్లను, కుటుంబాలను వదిలి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే నాణ్యమైన కోచింగ్ పొందవచ్చు. మన దేశంలో ఇప్పటికే అత్యుత్తమ డిజిటల్ మౌలిక వసతులు, అద్భుతమైన ఉపాధ్యాయుల బృందం అందుబాటులో ఉందన్న ప్రధాని,



వారందరినీ ఒకే వేదికపైకి తెచ్చి బృహత్తర ఆన్‌లైన్ కోచింగ్ వ్యవస్థను నిర్మిస్తామని చెప్పారు. సగటు కుటుంబాలు కోచింగ్ కోసం పెట్టే వేల కోట్ల రూపాయలను ఆదా చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. విద్యార్థులకు కుటుంబ సభ్యుల ఆప్యాయతతో పాటు నాణ్యమైన విద్య కూడా వారి సొంత ఊళ్లలోనే లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రపంచంలో ఆర్థికంగా బలహీనంగా ఉన్న దేశాల జాబితాలో నిలిచిన భారత్, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని మోదీ గుర్తుచేశారు. గత 12 ఏళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, రైల్వే కోచ్‌ల ఉత్పత్తి 21 రెట్లు, డిజిటల్ లావాదేవీలు ఏకంగా 100 రెట్లు పెరిగినట్లు వెల్లడించారు. అంతేకాకుండా సెమికండక్టర్ల తయారీలో భారత్ త్వరలోనే ప్రపంచ శక్తులకు గట్టి పోటీ ఇవ్వబోతోందని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్ సాంకేతికతకు అనుగుణంగా దేశంలోని కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ఆటల రంగానికి సంబంధించి 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోందని, అలాగే 2036 ఒలింపిక్స్‌ను మన దేశంలోనే నిర్వహించేలా ప్రణాళికలు వేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మునుపెన్నడూ లేని విధంగా కొత్త క్రీడల్లో మన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి గ్లోబల్ వేదికపై భారత్ జెండాను రెపరెపలాడిస్తామని ప్రకటించారు.

## స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం...?

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలో తొలగించిన 45 లక్షల ఓట్ల నుంచి కూడా వివరణలు తీసుకుని సవరణలు చేస్తే ఓటర్లు ఇంకా పెరుగుతారు. అలాగే యువ ఓటర్లు కొత్త ఓటర్లను కూడా చేరుతారు. అది కచ్చితమైన ఓటర్ల జాబితా అవుతుందని అంటున్నారు. మరి ఆ ఓటర్ల జాబితా చేతిలో పడితేనే తప్ప రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికలను నిర్వహించలేదని అంటున్నారు. అందుకే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు రెండు నెలల తరువాతనే జరుగుతాయని అంటున్నారు. ప్రస్తుతం ఆగస్టు మధ్యలో నడుస్తోంది. అక్టోబర్ 3న తుది జాబితా వచ్చిన తరువాత అన్నీ వేగవంతంగా పూర్తి చేస్తే అదే నెలలో స్థానిక ఎన్నికలు ప్రారంభించి రెండు విడతలుగా నిర్వహించవచ్చు అని అంటున్నారు. ఇక అదే సమయంలో ఓటర్ల జాబితాతో పాటుగా రిజర్వేషన్లు, కోర్టుకేసులు వంటి వాటి విషయంలోనూ స్పష్టత రావలసిన అవసరం ఉంది అని అంటున్నారు. ఇలా ఈ కీలక విషయాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉందని చెబుతున్నారు. మొత్తం మీద రాష్ట్ర ఎన్నికల సంఘం అయితే సిద్ధంగా ఉంది. ఇక అక్టోబర్ అంటే పండుగల నెలగా ఉంది. దసరా ఉత్సవాలు పెద్ద ఎత్తున పది రోజుల పాటు సాగుతాయి. దాంతో అక్టోబర్ మూడవ వారం కూడా ముగిసిపోతుంది. అలా అన్నీ పూర్తి చేసుకున్న తరువాత అక్టోబర్ నెలాఖరులో ఎన్నికలు జరిగే వీలుందని అంచనా వేస్తున్నారు. ఆ సమయం అయితే అన్ని విధాలుగా అనుకూలంగానే ఉంటుందని కూటమి ప్రభుత్వం కూడా భావిస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద మరో రెండు నెలలకు పైగా స్థానిక ఎన్నికల సమరం ముందుకు జరిగే అవకాశాలు అయితే ఉన్నాయని అంటున్నారు. ఎపుడు ఎన్నికలు జరిగినా కూటమిదే విజయం అని అధికార పార్టీ ధీమాగా ఉంది.

## చంద్రబాబుతో మరో కార్యక్రమానికి పవన్ డుమ్మా..!

(మొదటి పేజీ తరువాయి)

కళ్యాణ్ కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగిన నేపథ్యంలో, తర్వాత చేయించుకోవాల్సిన ఫిజియో థెరపీ గురించీ వైద్య నిపుణుల సూచనల్ని స్వీకరించనున్నారని జనసేన వెల్లడించింది. మరోవైపు తాజాగా అమరావతికి పవన్ రాకపోవడంపై ఆయనవైపు నుంచి కానీ, ప్రభుత్వం వైపు నుంచీ కానీ, కూటమి పార్టీల నుంచి కానీ ఎలాంటి స్పందన లేదు. అంతకు ముందు వరుసగా మూడు కేబినెట్ భేటీలకు పవన్ హాజరు కాలేదు. దీంతో కూటమిలో ఏం జరుగుతోందన్న చర్చ నెలకొంది.



## ఒక్క ఓటు కాదు.. 10 ఓట్లతో గేమ్ మార్చేస్తా..

కర్ణాటక ,ఆగస్టు 16: కర్ణాటకలో ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న వివాదం రాజకీయంగా మరింత వేడెక్కుతోంది. ఓటర్ల జాబితాలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్షా లు, పౌరసంఘాలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో నటు డు ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీ యాంశంగా మారాయి. ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేసే ప్రకాశ్‌రాజ్.. వచ్చే ఎన్నికల్లో తన పాత్ర ఎలా ఉండబోతుందో తనదైన శైలిలో వెల్లడించారు. తన తదుపరి ఓటుకు ఇంకా రెండేళ్ల సమయం ఉందని పేర్కొన్న ప్రకాశ్‌రాజ్.. తాను కేవలం ఒక ఓటు వేసే వ్యక్తిగా మాత్రమే ఉండబోనని అన్నారు. తన ఓటుతో పాటు మరో పది మంది ఓటర్లను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభావితం చేయగలనని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. "ఒక్క ఓటు కాదు.. పది ఓట్లతో గేమ్ మార్చేస్తా" అన్న భావనలో ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలు.. వచ్చే ఎన్నికలపై ఆయన ఇప్పటి నుంచే దృష్టి పెట్టినట్లు సంకేతాలు ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమేనని చెబుతూ ఓటర్లు తమ హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన పలు సందర్భాల్లో పిలుపునిచ్చారు. ప్రస్తుతం కర్ణాటకలో ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటర్ల పేర్ల తొలగింపు, జాబితాలో మార్పులు వంటి అంశాలపై వివిధ రాజకీయ పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రకాశ్‌రాజ్ తాజా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని భావిస్తే, దాన్ని ఎన్నికల సమయంలో ఓట్ల రూపంలోకి మార్చేందుకు ప్రజలను చైతన్యపరచాలని ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యల ద్వారా సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయన్నది రానున్న రోజుల్లోనే స్పష్టమవుతుంది. ఇక ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ.. ఓటర్ల జాబితా, ప్రజాస్వామ్య హక్కులు, ప్రభుత్వ పనితీరు వంటి అంశాలపై ఇప్పటి నుంచే చర్చ మొదలవడం కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. ప్రకాశ్‌రాజ్ తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలోనూ చర్చకు దారితీస్తున్నాయి.

## ఆగస్టు 20లోగా మీ ఖాతాల్లో రూ.25 వేలు!

ఆంధ్రప్రదేశ్,ఆగస్టు 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం మరోసారి శుభవార్త చెప్పింది. ఇప్పటికే చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడం కోసం నేతన్న సేవలో పథకాన్ని ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా ప్రతి సంవత్సరం అర్హులైన చేనేత కుటుంబాలకు 25 వేల రూపాయలు చొప్పున అందిస్తున్నారు. ఈ సంవత్సరం ఈ పథకానికి సంబంధిం చిన నిధులను ఇప్పటికే చేనేతల ఖాతాలో జమ చేశారు. అర్హత ఉన్నా పథకం అందకపోతే ఆందోళన వద్దు: మంత్రి సవిత అయితే కొంతమంది పథకం కోసం అప్లై చేసుకున్న చేనేతలకు అర్హతలు ఉన్నప్పటికీ ఈ పథకం వర్తించకపోవ టంతో చేనేతలు ఆందోళనలో ఉన్నారు. అటువంటి వారికి ఊరట కలిగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక ఈ విషయాన్ని ఏపీ మంత్రి సవిత వెల్లడించారు. అర్హత ఉండి కూడా సహాయం అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క అర్హత ఉన్న చేనేత కార్మికులకు సహాయం అందిస్తుందని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు, ఏవైనా అనుమానాలు ఉంటే చేనేత జౌళి శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. తప్పుడు వార్తలు, వదంతులు నమ్మి భయపడవలసిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో డబ్బులు పడని వారికి ఈనెల 20వ తేదీలోగా వారి సమస్యను పరిష్కరించే బ్యాంక్ కథలు డబ్బులు జమ చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు. కొత్త దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నామని త్వరలోనే నిధులు పంపిణీ చేస్తామని తెలిపారు. కొత్త దరఖాస్తులను పరిశీలిస్తున్నాం అన్న మంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే 71,536 మంది చేనేతలకు 25వేల రూపాయలు చొప్పున సహాయం అందించినట్టు మంత్రి సవిత పేర్కొన్నారు. కొత్తగా



13678మంది దరఖాస్తు చేసుకున్నారని, వారందరి దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం అరకులో గుర్తింపు ప్రక్రియ వేగంగానే కొనసాగుతుందని వెల్లడించారు. ముఖ్యంగా నేతన్న సేవలో పథకం పొందాలని భావించే చేనేత కార్మికులు ఆంధ్రప్రదేశ్ నివాసి అయ్యి ఉండాలని, చేనేత సంఘాలలో, లేదా చేనేత సొసైటీలో సభ్యుడిగా ఉండాలని పేర్కొన్నారు. సొంత మగ్గం కలిగి ఉండి చేనేత వృత్తిపై ఆధారపడుతూ ఉండాలని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఆధార్, చేనేత మగ్గం గుర్తింపు కార్డు, సొసైటీ రిజిస్ట్రేషన్ కాపీ, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, ఇన్కమ్ సర్టిఫికెట్, రేషన్ కార్డు ఉండాలని, ఇవన్నీ సరిగ్గా ఉంటే తప్పనిసరిగా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.




## తిరుమలలో అయిదు రోజులు వరుణయాగం..!

తిరుమల, ఆగస్టు 16: వర్షాభావ పరిస్థితుల వేళ తిరుమలలో వరుణ యాగం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ముహూర్తం ఖరారు చేసింది. గతంలోనూ ఇలాంటి పరిస్థితుల్లో టీటీడీ వరుణయాగం నిర్వహించింది. ఈ సారి అయిదు రోజుల పాటు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్న టీటీడీ.. ఈ మేరకు తుది కసరత్తు చేస్తోంది. ప్రత్యేక మైన నియమ నిబంధనలతో ఈ వరుణయాగం నిర్వహిస్తారు. ఈ యాగానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతోంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో వర్షపాత లోటు కనిపిస్తోంది. దీంతో.. టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం లో పంటలు పండి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుంచి అయిదు రోజుల పాటు ధర్మగిరి వేదపాఠశాలలో వరుణయా గాన్ని నిర్వహించేలా నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వర్షాలు పడి నీటి సమస్య లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించాలని ముహూర్తాన్ని నిర్ణయిం చారు. ఇందులో భాగంగా వేదవిజ్ఞానపీఠంలో యాగకర్త, రుత్వికుల సమక్షంలో ఆగస్టు 30, 31, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో వరుణయా గాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి ఇప్పటికే టీటీడీ ఉతర్వులు జారీ చేయగా, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరుణుడిని ప్రసన్నం చేసుకునేందుకు అయిదు రోజులపాటు ఈ యాగం .. క్రతువు నిర్వహిం చనున్నారు. దేశ వ్యాప్తంగా పలువురు ప్రముఖ రుత్వికలు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం యాగం నిర్వహిస్తారని అధికారులు వివరించారు. కాగా, ఈ నెలలోనే తిరుమలలో రెండు సార్లు గరుడ వాహన సేవ నిర్వహిం చనున్నారు. గరుడ పంచమి, శ్రావణ పౌర్ణమి రోజున మాడ వీధుల్లో శ్రీవారి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇక.. ఈ ఏడాది రెండు సార్లు తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. వచ్చే నెలలో జరిగే బ్రహ్మోత్సవాల వేళ పెద్ద ఎత్తున కొత్త నిర్మాణాలు.. వసతి సముదాయాలను భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

## సీఎం రేవంత్ గుడ్ న్యూస్..!!



తెలంగాణ,ఆగస్టు 16: ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన చేసారు. సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని, దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్రంలో 92 శాతం అధికంగా ఉందని తెలిపారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని ఈ ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. అర్హులకు పథకాలు అందిస్తామని... ప్రతీ హామీ నిలబెట్టుకుంటామని రేవంత్ స్పష్టం చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ తన ప్రభుత్వంలో చేపట్టనున్న కీలక లక్ష్యాలను వివరించారు. గోల్కొండ కోటలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రేవంత్ రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించామని, మొత్తంగా రైతు సంక్షేమం కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని.. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం సరికొత్త రికార్డులు అధిగమించిందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామని తేల్చి చెప్పారు. అదే విధంగా త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని రేవంత్ వెల్లడించారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు.



## బీసీలకు ఎక్కడ ఎన్ని స్థానాలు.. ఇదీ లెక్క..!!

ఆంధ్రప్రదేశ్,ఆగస్టు 16: ఏపీలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. ప్రభుత్వం.. ఎన్నికల సంఘం ఈ దిశగా కసరత్తు చేస్తోంది. ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్ల వ్యవహారం కీలకంగా మారుతోంది. ఇప్పటికే రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్ల పైన కీలక సిఫారసులతో నివేదికను సమర్పించింది. రాష్ట్రంలో బీసీలు 50.26 శాతం ఉన్నట్లు తేల్చిన కమిషన్.. దీని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు నిర్ధారిస్తూ సిఫారసులు చేసింది. ఈ లెక్కన ఎక్కడ బీసీలకు ఎన్ని స్థానాలు దక్కుతాయనే అంచనాలు మొదలయ్యాయి. ఏపీలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పైన రాజీవ్ రంజన్ మిశ్రా ప్రభుత్వానికి అందించిన నివేదిక లో కీలక అంశాలను ప్రస్తావన చేసింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీలు 50.26 శాతం ఉన్నట్లు కమిషన్ తేల్చింది. దీని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు నిర్ధారిస్తూ ప్రభుత్వానికి సిఫారసులు చేసింది. దీంతో.. నోటిఫై చేసిన షెడ్యూలు ఏరియాల్లో మొత్తం సీట్లను ఎస్టీలకు మాత్రమే కేటాయించాల్సి ఉంది. మిగిలిన నాన్-షెడ్యూల్ ప్రాంతాల్లోని స్థానిక సంస్థల స్థానాల్లో మాత్రమే బీసీ రిజర్వేషన్లు వర్తిస్తాయి. దీని ప్రకారం.. పంచాయతీ వార్డులు కాకుండా.. ఇతర స్థానిక సంస్థల స్థానాల్లో బీసీలకు 27.66 శాతం స్థానాలు లభిస్తున్నాయి. 2021లో ఇది 23.84 శాతం మాత్రమే. అంటే... గతంలో కంటే ఇప్పుడు 3.82 శాతం కోటా పెరిగినట్లు. పంచాయతీ వార్డులను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య మారే అవకాశం ఉంటుంది. కాగా.. నాన్ షెడ్యూల్ ఏరియాలో మొత్తం 11,190 సర్పంచ్ స్థానాలున్నాయి. వీటిలో 27.95 శాతం బీసీలకు కేటాయించాలని కమిషన్ సూచన చేసింది. ఇక, ఎంపీపీలు 24.6 శాతం, ఎంపీటీసీలు 25.55 శాతం, జడ్పీటీసీలు 24.6 శాతం, జడ్పీ చైర్‌పర్సన్‌లు 23.08 శాతం బీసీలకు కేటాయించాలని కమిషన్ సిఫారసు చేసింది. కార్పొరేషన్ల మేయర్లలో 35.29 శాతం బీసీలకు కేటాయించాలని స్పష్టం చేసింది. గతంలో ఈ సంఖ్య 31.25 శాతం మాత్రమే. ఇక.. మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌లు 33.02 శాతం కేటాయించాలని తెలిపింది. గతంతో పోల్చితే ఈ సంఖ్యలో పెద్దగా మార్పు లేదు. పట్టణ స్థానిక సంస్థల వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్ మాత్రం గతంలో 30.73 శాతం ఉండగా... ఇప్పుడు దానిని 32.78 శాతానికి పెంచాలని కమిషన్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈ సిఫారసుల పైన అధ్యయనం చేసి.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీ అమలు దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# అర్బన్ బ్యాంకులో జాతీయ జెండా ఆవిష్కరణ



అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ కృష్ణ దేవరాయ భవన్‌లోని అర్బన్ బ్యాంక్ ప్రాంగణంలో దేశభక్తి వాతావరణం నడుమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ బ్యాంక్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు జెఎల్. మురళీధర్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతికి వందనం చేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జెఎల్. మురళీధర్ మాట్లాడుతూ.. భారతదేశానికి స్వేచ్ఛను అందించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతి పౌరుడు తన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాలని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అర్బన్ బ్యాంక్ ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించి, పారదర్శకతతో కూడిన బ్యాంకింగ్ సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. సమాజ అభివృద్ధికి బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజల విశ్వాసమే తమకు అతిపెద్ద బలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ జాతీయ జెండాకు వందనం చేసి, దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. చివరిగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రతి భారతీయుడు దేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింత ఉన్నత సా-ధయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని జెఎల్. మురళీధర్ ఆకాంక్షించారు. అనంతరం పాల్గొన్న అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను ఘనంగా ముగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు చింతల భాస్కర్, జంగం శెట్టి రామాంజినేయులు, డైరెక్టర్లు బావి గడ్డ రమణయ్య, కృష్ణ కుమార్, మాగిశెట్టి చంద్రశేఖర్, గోల్డ్ బాషా, వెంకటాద్రి, రోళ్ళ భాస్కర్, సుబ్రమణ్యం, అనీల్ నాయుడు, సీఈఓ నవీన్ కుమార్, మెనేజర్లు మేఘన, ఖాజా, సతీష్, రాధ, హేమ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకావిష్కరణ చేసిన డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య



అనంతపురం, ఆగస్టు 15 ( అనంత సూర్య ): అనంతపురం నగరంలోని ఆదిమూర్తినగర్ లో ఉన్న ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య జాతీయ పతాకావిష్కరణ చేసి.. జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం కార్యాలయం అధికారులు, సిబ్బందితో గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ ప్రభాకర్, పిఆర్ఓ వి.సూర్యనారాయణ రెడ్డి, ఏపిఆర్ఓ ఫక్రుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ ప్రభావతి, కార్యాలయం సిబ్బంది చాంద్ భాష, సుహాసిని, కోటి, తాజుద్దీన్, భాస్కర్, కాసీం, నజీర్, రాజారావు, అమ్మన్ని, శైలజ, గంగ పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : శ్రీ చైతన్య ఏటీపీ-1 బ్రాంచ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా.. ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 7.30 గంటలకు కోర్ట్ రోడ్ బ్రాంచ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా వందనం అనంతరం జాతీయ గీతాలాపన చేసి, దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్.. ఎంతో మంది స్వాతంత్ర సమర-యోధుల అమర వీరుల త్యాగాలను ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల త్యాగాలను స్మరించుకోవడం, దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందేలా కృషి చేయాలని, దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అలాగే అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్ మాట్లాడుతూ.. భారతదేశం యొక్క గొప్ప ఔన్నత్యాన్ని భారతదేశం కోసం ఎంతో మంది ప్రాణాలు అర్పించిన వీరులందర్నీ స్మరించుకుంటూ నేటి విద్యార్థులు భారతదేశం యొక్క ఔన్నత్యానికి ముందడుగు వేయాలని భారతదేశం యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు చాటి చెప్పారు. జోనల్ కోఆర్డినేటర్ గోపాల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఎంతోమంది వీరులను స్మరించుకుంటూ వాళ్ల త్యాగాలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు కూడా దేశం కోసం పాటుపడాలని, మనమందరం వికసిక్ భారత్ వైపు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర సమరయోధులను గుర్తు చేసుకుంటూ కొంతమంది విద్యార్థులు వేషధారణతో, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులందరినీ అలరించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య అకాడమీ డీన్లు చిరంజీవి, సుప్రజ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనంతపురం క్లబ్ స్నూకర్ ఛాంపియన్ గా షౌకత్ ఖాన్



అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : స్థానిక అనంతపుర్ క్లబ్‌లో నిర్వహించిన స్నూకర్ 2026 ఛాంపియన్‌షిప్‌లో వరుస విజయాలతో షౌకత్ ఖాన్ ఛాంపియన్ గా నిలిచారు. తనదైన శైలితో ప్రత్యర్థులకు చెక్ పెడుతూ విజయం తన సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆగస్ట్ 15న 80వ ఇండిపెండెన్స్ డే సందర్భంగా అనంతపుర్ క్లబ్ యాజమాన్యం, ఆయన సన్నిహితులు, క్లబ్ సభ్యులు.. విజేత షౌకత్‌కు సత్కరించి హర్షం వ్యక్తం చేశారు.

# ఉత్తమ జేఏవోగా సయ్యద్ బాబా ఫక్రుద్దీన్

అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ టౌన్ జేఏవోగా సయ్యద్ బాబా ఫక్రుద్దీన్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం నగరంలోని జిల్లా విద్యుత్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఎస్ ఈ శేషాద్రి శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఉద్యోగులు కార్మికులకు ఆయన ప్రత్యేకంగా స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి వేడుకలు ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు బాధ్యతాయుతమైన పదవిలో వారికి మెరుగైన విద్యుత్ అందించడమే ప్రధాన లక్ష్యంగా సంస్థ మనుగడకు ఉద్యోగుల న్యాయపరమైన విధులు ప్రధానమని వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఆయన చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. సయ్యద్ బాబా ఫక్రుద్దీన్ ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఆయనకు తోటి ఉద్యోగులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్రతిభా పురస్కారాలు అందజేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మంగళకుంట నాగరాజు



అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : కంబదూరు మండలం నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 600 మార్కులకు గాను 568 మా-ర్కులు సాధించి నూతిమడుగు ఉన్నత పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన కావలి శ్రీనివాసులు, శివమ్మ దంపతుల కుమార్తె కావలి హారిక అనే విద్యార్థినికి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు మంగళకుంట నాగరాజు.. విద్యార్థికి ఐదు వేల రూపాయల నగదు బహుమతితో పాటు గోల్డ్ మెడల్ ను, జ్ఞాపికను అందజేశారు. ప్రతి సంవత్సరము పాఠశాలలో మొదటి ర్యాంకు వచ్చిన విద్యార్థికి ప్రతిభా పుర-స్కారాలను జీవశాస్త్ర ఉపాధ్యాయులు మంగళకుంట నాగరాజు అందజేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పరమేష్, వైస్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ.. మన పాఠశాల విద్యార్థుల యొక్క భవిష్యత్తును వారి యొక్క ఉన్నతిని ఆకాంక్షిస్తూ ఇంత మంచి పని చేస్తున్న నాగరాజునీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ నరసింహులు మాట్లాడుతూ.. మన స్కూల్లో పనిచేస్తూ ఇంత మంచి సహాయ గుణం కలిగిన మంగళ కుంట నాగరాజు మన పాఠశాలలో చాలాకాలం పనిచేసి మా పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. నరసింహులు కూడా ఎవరైతే ఐఐటీలలో సీట్లు తెచ్చుకుంటారో వారందరికీ 25 వేల రూపాయలు వారి పేరు మీద డిపాజిట్ చేస్తానని తెలియచేశారు. మంగళకుంట నాగరాజు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరము ఈ ప్రతిభ పురస్కారాన్ని అందించడానికి గల కారణం పిల్లల్లో ఉండే ప్రతిభను వెలికి తీయడానికి, అదే విధంగా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైనటువంటి పోటీ తత్వాన్ని అలవర్చడానికి ఉపయోగపడుతుందనే సదుద్దేశంతో ఈ ప్రతిభా పురస్కారాన్ని అందజేస-్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డును అందించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మంగళకుంట నాగరాజుని ప్రధానోపాధ్యాయులు రాజశేఖరరెడ్డి, పాఠశాల యా-జమాన్య కమిటీ చైర్మన్ పరమేష్, వైస్ చైర్మన్ ప్రసాద్, మాజీ సర్పంచ్ నరసింహులు, దాసరి సుధాకర్, శంకరనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# సాఫ్ట్‌బాల్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ అక్షయ్ సాగర్‌కు 'బెస్ట్ పెర్ఫార్మర్' అవార్డు



రాప్తాడు, ఆగస్టు 15:( అనంత సూర్య ): సాఫ్ట్‌బాల్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచిన బుడగల అక్షయ్ సాగర్ 'బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025-2026' అవార్డును అందుకున్నారు. కాకినాడ సమీపంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో, వర్సిటీ ప్రో-ఛాన్సలర్ సతీష్ రెడ్డి చేతుల మీదుగా అక్షయ్ సాగర్ ఈ జ్ఞాపికను స్వీకరించారు. అనంతపురం జిల్లా రాప్తాడు విశాలాంధ్ర సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్, కీర్తిశేషులు ఉమాదేవి దంపతుల కుమారుడైన అక్షయ్ సాగర్ సాధించిన ఈ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, యూనివర్సిటీ యాజమాన్యం అక్షయ్ తండ్రి శ్రీనివాస్‌ను వేదికపై శాలువాతో ఘనంగా సన్మానించింది. క్రీడల్లో విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ఇచ్చే ప్రోత్సాహం ఎంతో అభినందనీయమని ప్రో ఛాన్స్ లర్ సతీష్ రెడ్డి కొనియాడారు. క్రీడల్లో రాణిస్తూ కళాశాలకు, రాప్తాడు ప్రాంతానికి మంచి పేరు తెస్తున్న అక్షయ్ సాగర్‌ను వర్సిటీ అధ్యాపకులు, తోటి విద్యార్థులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు అభినందించారు.

# వికసిత్ భారత్, వికసిత్ ఏపీ, స్వచ్ఛ అనంతే మా లక్ష్యం

## 80వ స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లో భాగస్వామ్యమవుతూ.. అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శనివారం జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా అర్బన్ టీడీపీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తర్వాత నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ప్రధాన గేట్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జస్వంత్ కుమార్ తో పాటు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. అక్కడి నుంచి పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ ప్రభుత్వ శకటాల ప్రదర్శనను వీక్షించారు. మంత్రి పయ్యావులతో పాటు కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధుల పలుకరిస్తూ చాలా సేపు అక్కడే గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 80ఏళ్ల స్వాతంత్ర్యం సందర్భంగా ఎంతో మంది సమరయోధుల త్యాగల ఫలితం మనకు ఈ స్వాతంత్ర్యమని.. మన త్రివర్ణ పతాకం ఈ రోజు దేశ వ్యాప్తంగా రెపరెపలాడుతోందంటే వారే కారణమన్నారు. అలాంటి మహనీయులను మనం ఎప్పటికీ మరువకూడదన్నారు. వారి స్ఫూర్తితోనే ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తుంటే... ముఖ్యమంత్రి చంద్రబాబు వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. 20ఏళ్లు వెనుకబడిన రాష్ట్రాన్ని రెండేళ్లలో సీఎం చంద్రబాబు ప్రగతి పథంలో నిలబెట్టారన్నారు. గతంలో మన రాజధాని ఏది అంటే చెప్పలేని పరిస్థితి ఉండేదని.. అందుకే రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలని.. అమరావతే రాజధాని అని చట్టం చేశారన్నారు. ఇప్పటికే అమరావతిలో ఎమ్మెల్యే క్వార్టర్స్ తో పాటు అనేక నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. గోదావరి పుష్కరాల్లోగా పోలవరాన్ని పూర్తి చేసి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తారన్నారు. రాష్ట్రానికి 25లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. గత ఏడాది ఇదే ఆగష్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించగా.. జిల్లాలోని 322బస-్సులో ఇప్పటి వరకు 2.80కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని.. ఇందుకోసం 132కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో రెండేళ్లలో 200కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. 100కోట్లతో డ్రైన్లు, 160కోట్లతో రోడ్లు నిర్మాణాలు త్వరలోనే చేపడుతామన్నారు. స్వచ్ఛ అనంత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరి సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# శ్రీ చైతన్యలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య :**

శ్రీచైతన్య ఏటీపీ-6 బ్రాంచ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం, సత్యసాయి జిల్లాల శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యం అనేది కేవలం హక్కు మాత్రమే కాదు, అది మనపై ఉన్న బాధ్యత కూడా.. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉంది. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగుతూ భారతదేశాన్ని మరింత అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించాలి. విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం ప్రతి విద్యార్థి లక్ష్యంగా పెట్టుకోవాలి' అన్నారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించే కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, నరేష్ కుమార్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, డీన్లు భవిత, శ్రీకాంత్, శ్రీనివాస్ పట్నాయక్, జయచంద్ర, ఏఓ/టీ రామకృష్ణ, హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ట్రెల్లిస్ స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య :**

ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నామని ట్రెల్లిస్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ వడ్ల అన్నారు. ట్రెల్లిస్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్ సింగ్, మాతంగిని హజ్రా, ఉధమ్ సింగ్ వంటి మహనీయుల త్యాగాలను ట్రెల్లిస్ స్కూల్ డైరెక్టర్ అనిల్



తేజ కొనియాడారు. 'స్వేచ్ఛ అంటే మనకు నచ్చినట్లు వ్యవహరించడం లేదా ఇతరుల హక్కులను బలవంతంగా తీసుకోవడం కాదు. స్వాతంత్ర్యం మనకు లభించిన ఒక గొప్ప బాధ్యత. దానిని గౌరవిస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి' అని కరస్పాండెంట్ శ్రీకాంత్ తెలిపారు. 'మనం నేడు ప్రశాంతంగా, సురక్షితంగా జీవిస్తున్నామంటే దేశ సరిహద్దుల్లో లక్షలాది మంది సైనికులు అహర్నిశలు కాపలా కాస్తుండటమే కారణం. వారి త్యాగాలను మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలి' అని స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ భార్గవి అన్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# నారాయణ స్కూలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : నగరంలోని ద్వారకనగర్‌లోని నారాయణ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం జాతీయ జెండా ఆవిష్కరించి గీతాలాపన చేశారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించే కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం








**అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య :**

అనంతపురం గుత్తి రోడ్‌లోని హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో 80వ స్వాతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీఎం రామసుబ్బారెడ్డి, సీఈఓ ప్రతాపరెడ్డి, ఏజీఎం శంకర్‌నారాయణ, ప్రిన్సిపల్ ఉమా కామేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేశారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అబ్బురపరిచాయి. చిన్నారుల వేషధారణలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నా యి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనేది కేవలం హక్కు




మాత్రమే కాదు, అది మనపై ఉన్న బాధ్యత కూడా.. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉంది. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగుతూ భారతదేశాన్ని మరింత అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించాలి. విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందిం చుకోవడం ప్రతి విద్యార్థి లక్ష్యంగా పెట్టుకోవాలి' అన్నారు. అదేవిధంగా స్కూల్ ఇన్వెస్టర్ సర్మనీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక అధ్యాపకేతర బృందంతో పాటు విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.





## స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. 'అనంత'లో వైసీపీకి షాక్

- 48వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జ్ సంగాల సురేష్ సహా పలువురు టీడీపీలో చేరిక
- సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి
- 48వ డివిజన్ రజక నగర్‌లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం
- 5 డివిజన్లు, 14కాలనీలకు ముంపు నుంచి పరిష్కారం చూపించామన్న ఎమ్మెల్యే



**అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య :**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ అనంతపురం నగరంలో వైసీపీకి షాక్ తగిలింది. 48వ డివిజన్ ఇన్ ఛార్జ్ సంగాల సురేష్ తో పాటు వైసిపి సోషల్ మీడియా నగర ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తో పాటు 20 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వీరికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం సాయంత్రం ఆయన 48వ డివిజన్లోని రజక నగర్లో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దగ్గుపాటికి ఘన స్వాగతం పలికారు. అలాగే టిడిపిలోకి చేరిన వారంతా కూడా ఎమ్మెల్యే వెంట వచ్చారు. ఆయన ఇంటింటికి వెళ్తూ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రజక్ నగర్ లో చేసిన అభివృద్ధి గురించి స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చూసిన అభివృద్ధి చూసి వైసిపి వారు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. కొత్తగా వచ్చిన వారికి పార్టీలో కచ్చితంగా ప్రాధాన్యమిస్తామని.. తాము చేసే అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. 48వ డివిజన్లో గత ఐదేళ్లపాటు వైసీపీ కార్పొరేటర్ ఉన్నప్పటికీ కూడా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదని దగ్గుపాటి విమర్శలు చేశారు. ఈ రెండేళ్లలోనే రెండు కోట్ల రూపాయలతో ఇక్కడ అభివృద్ధి చేసినట్లు వివరించారు శాంతినగర్ బోర్డు నుంచి తపోవనం వరకు నూతన రోడ్డు నిర్మించమన్నారు. మరోవైపు గతంలో వర్షం వస్తే రజక నగర్ ప్రాంతం ముంపుకు గురయ్యేదన్నారు. దీనికి కారణాలను ఆరా తీస్తే ఇక్కడ కొందరు స్థలాన్ని కబ్జా చేయడం వలన వర్షం వస్తే నీటి ప్రవాహం ముందుకు వెళ్లక కాలనీలోకి వస్తున్నట్లు గుర్తించామన్నారు. అందుకే రెవెన్యూ అధికారులతో కలిసి ఆ స్థలాన్ని కబ్జా కోరల్లో నుంచి బయటికి తీసుకొచ్చామన్నారు. 5డివిజన్లు, 14 కాలనీల్లో వారికి ఉన్న ముంపు సమస్య తీరిందన్నారు. అలాగే నడిమి వంక, మరువవంక ప్రొటెక్షన్ వాల్స్‌కి 78 కోట్ల రూపాయలతో పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు. వైసిపిని ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని అందుకే ఆ పార్టీ నాయకులు కూడా తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నట్లు చెప్పారు. కచ్చితంగా స్థానిక సంస్థలు ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధికి ప్రజలు పట్టడం కడతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ వన్నురప్ప, యూనిట్ ఇంచార్జ్ మోహన్ కుమార్, టిడిపి నాయకులు దలవాయి మహేశ్వరి, కృష్ణ, జావేద్, కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, రంగాచారి, పరమేశ్వర్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూజేఏసీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

అనంతపురం, ఆగస్టు 15 అనంత సూర్య : స్థానిక సాయినగర్‌లోని యూజేఏసీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు.



జాతీయ జెండాను యూజేఏసీ కన్వీనర్ జాఫర్ ఎగురవేసి జాతీయ గీతాలాపన చేశారు. ఆయనతోపాటు సీనియర్ అడ్వకేట్ అబ్దుల్ రసూల్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, మైనారిటీ పత్రిక ఎడిటర్ బాబాషా, కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు దాదా గాంధీ, సిపిఐ నాయకులు గోల్డ్ బాషా, వైసీపీ మైనారిటీ నాయకులు షేక్ జావీద్, షఫీ, అలీ.. పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సంగ్రామం అనేది వివిధ సిద్ధాంతాలు, మతాలు, వర్గాల ప్రజలు బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఐక్యంగా జరిపిన సుదీర్ఘ వీరోచిత పోరాటం అన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో అహింస, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్య పరచిందన్నారు. కార్మికులు, రైతులు, శ్రామిక వర్గాలను సమీకరించి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ, రైతు పోరాటాలు నిర్వహించిందన్నారు. ప్రారంభ దశలో, అనేక జాతీయ ఉద్యమాలలో ముస్లిం నాయకులు, సాధారణ ప్రజలు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించి, కాంగ్రెస్ అధ్యక్షుడిగా నాయకత్వం వహించారని గుర్తు చేశారు. అనేక సిద్ధాంతాలు, వివిధ మతాల త్యాగాల పునాదులపై 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని గుర్తు చేశారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405